ముంచెత్తుతున్న డ్రైనేజీ

అండర్ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక అవస్థలు ● తాత్కాలిక మరమ్మతులతో ఉపశమనం

జహీరాబాద్: పట్టణంలోని వసుంధరకాలనీని డ్రైనేజీ నీరు ముంచెత్తుతోంది. దీంతో కాలనీవాసులకు అనునిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. దశాబ్దకాలం క్రితం కాలనీ ఏర్పాటయింది. అప్పట్లో పస్తాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండటంతో ఇష్టారీతిగా కాలనీని ఏర్పాటు చేయడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళిక లేకపోవడమే..

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం వల్లే సమస్య తలెత్తుతోంది. డ్రైనేజీ కోసం తక్కువ వెడల్పు ఉన్న పైపులను వాడటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎగువన ఏర్పాటు చేసిన ఎక్బాల్ కాలనీ, రాయల్ కాలనీల నుంచి వచ్చే మురికి నీటిని వసుంధర కాలనీ అండర్ డ్రైనేజీలో కలపడం వల్ల స్తంభించిపోతోంది. ఆ మురికి నీరంతా



రహదారిపై నిలిచిన డ్రైనేజీ నీరు

రోడ్లపై నుంచి పారుతూ కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉంటుంది. దుర్వాసన, దోమల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను తాత్కాలికంగా మర్మమతులతో చేతులు దులుపుకొంటున్నారని వాపోతున్నారు. కాలనీ వెంచర్‌లో వదిలిన పార్కు ప్రదేశాన్ని కూడా వెంచర్ నిర్వాహకుడు తన అధీనంలోకి తీసుకున్నట్లు ఆరోపించారు.పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు సైతం ఇరుకుగా ఉండటంతో రాకపోకల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రోడ్లు తదితర సమస్యల తీవ్రత తెలిపేందుకు మున్సిపల్ కార్యాలయానికి మహిళలు పెద్ద సంఖ్యలో పలుమార్లు తరలివెళ్లి అధికారులకు విన్నవించినా స్పందిండం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

సంగారెడ్డి రూరల్ ఎస్సైగా మధుసూదన్ రెడ్డి



సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి రూరర్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా మధుసూదన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా పనిచేసిన రవీందర్‌పై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. నూతన ఎస్ఐకి స్టేషన్ సిబ్బంది శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నీరే ప్రాణకోటికి జీవనాధారం



ఇంకుడు గుంతను ప్రారంభించిన రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భూమిపై జీవిస్తున్న ప్రాణకోటికి నీరే జీవనాధారమని, అలాంటి నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హెచ్ఎం రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన ఇంకుడు గుంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో రానున్న నీటి సమస్యను ఎదుర్కొనేందుకు ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని సూచించారు. ప్రతి వర్షపు నీటిబొట్టును ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే పెద్ద మొత్తంలో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. కరువు పరిస్థితుల్లో కూడా బావులు, బోర్లలో నీరు లభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, నవనీత, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పునప్రారంభం



రోడ్డు పనులు చేస్తున్న జేసీబీ

మునిపల్లి(అందోల్): కంకోల్ నుంచి రాయికోడ్ మండలం కప్పాడ్ వరకు డబుల్ రోడ్డు పనులు పునప్రారంభమయ్యాయి. సోమవారం మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామ శివారు నుంచి పెద్దచల్మెడ గ్రామ శివారులో గతంలో తవ్వి కంకర వేసిన రోడ్డును చదును చేసే పనులు చేస్తున్నారు. మధ్య మధ్యలో రోడ్డును తవ్వి లెవల్ చేసి కంకోల్ నుంచి రాయికోడ్ మండలం కప్పాడ్ వరకు డబుల్ రోడ్డు వేయనున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. సైడ్‌వాల్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తూ పనులను నిర్వహించనున్నట్లు చెప్పారు.


ముద్దాయిపేట చెరువులో మొసలి



ఒడ్డుపై ఉన్న మొసలి

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని ముద్దాయిపేట కామిళ్ల చెరువులో మొసలి కనిపించింది. దీంతో పశువులు, గొర్రెల, మేకల కాపరులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సింగూరు ప్రాజెక్టుకు భారీ వరదలు రావడంతో క్రస్టుగేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. ఈ క్రమంలో మొసలి నీటి ప్రవాహ కాలువల గుండా ముద్దాయిపేట చెరువులోకి చేరి ఉంటుందని భావిస్తున్నారు. వన్యప్రాణి సంరక్షణ అధికారులు మొసలిని బంధించి మంజీరా మొసల్ల కేంద్రంలో వదిలిపెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సదాశివపేట ఎస్ఐ రవిగౌడ్ హెచ్చరించారు. సోమవారం రాత్రి ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పెద్దాపూర్ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు రోడ్డు భద్రత నియమాలు, వాహన చట్టాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారుల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఇటీవల విలీనమైన గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ముత్తంగి గ్రామ పరిధిలోని వివిధ కాలనీల్లో రూ.12 కోట్ల 30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. విలీన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ముత్తంగి పరిధిలోని నూతన కాలనీల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మండల తహసీల్దార్ రంగారావు, మున్సిపల్ కమిషనర్ అజయ్‌రెడ్డి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ రసాయన నిల్వలు సీజ్

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన రసాయన డ్రమ్ములకు సంబంధించి నార్కోటిక్, డ్రగ్ కంట్రోల్, అగ్నిమాపకశాఖ అధికారులు ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. అయితే అక్రమంగా నిల్వ చేసిన రసాయనాల శాంపిళ్లను అధికారులు సేకరించినట్లు సమాచారం. జనావాసాల మధ్య నిల్వ చేయడంతో రసాయన డ్రమ్ములను సీజ్ చేసి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి అధికారుల ప్రకటన రాలేదు. రాంకీ పరిశ్రమకు తరలించాల్సిన రసాయనాలను అక్కడ ఎందుకు నిల్వ చేశారనే కోణంలో ఆయాశాఖల అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.

నేడు వాహనాల వేలం

జహీరాబాద్ టౌన్: తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 14న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ రమేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ అధికారుల తనిఖీ, దాడుల్లో 9 వాహనాలు(మోటారు బైక్) పట్టుబడ్డాయన్నారు. పట్టణంలోని కార్యాలయ ఆవరణలో ఉ. 11 గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు నిర్దేశించిన ధరావత్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలంలో వాహనాలు దక్కించుకోని వారికి ధరావత్ డబ్బు తిరిగి చెల్లిస్తామని చెప్పారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించండి

మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్



అదనపు కలెక్టర్‌కు వివరిస్తున్న శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు సంఘటనలో మరణించిన, గాయపడిన, మిస్సింగ్‌లో ఉన్న వారి కుటుంబాలకు ఇంత వరకు పూర్తి నష్టపరిహారం అందించలేదని మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘటన జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం ఏ ఒక్కరికి పూర్తిగా నష్ట పరిహారం అందలేదన్నారు. దీనిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కోర్టు పేరు చెప్పి బాధితులకు ఇస్తామన్న రూ. కోటి ఇవ్వకపోవడం సరికాదన్నారు.

అక్రమలపై విచారణ జరపండి..

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 1016లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను శ్రీకాంత్ గౌడ్ కోరారు. అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి, అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ టీపీఓ పవన్ సిబ్బంది చేసిన అక్రమాలపై విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

నీటి ఎద్దడి నివారించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాలనీవాసులు

సంగారెడ్డి జోన్: మిషన్ భగీరథ తాగునీరు ప్రతిరోజు సరఫరా చేసి నీటి ఎద్దడిని నివారించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆదిత్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారు మాట్లాడుతూ కాలనీలో వారంలో రెండు రోజులు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని వాపోయారు. ఇతర ప్రాంతాలకు ఎక్కువగా నీటిని సరఫరా చేస్తూ జిల్లా కేంద్రంలో తగినంతగా నీటిని సరఫరా చేయకపోవడం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికగా 'పటాన్‌చెరు'

- 6 నుంచి రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్రస్థాయి క్రీడలకు పటాన్‌చెరు నియోజకవర్గాన్ని వేదికగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా 16 నుంచి 18 వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్, కబడ్డీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14, 17 కబడ్డీ బాలుర బాలికల ఎంపిక పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 33 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు, 60 మంది కోచ్‌లు, 160 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఈ క్రీడోత్సవాల్లో పాల్గొనబోతున్నారని చెప్పారు. మూడు రోజుల పాటు వాలీబాల్, కబడ్డీ పోటీలు జరగనున్నాయని, రూ.40 లక్షలు సొంత నిధులతో క్రీడోత్సవాల నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడాభిమానులు అధిక సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయకరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గౌసుద్దిన్, ఎల్లయ్య, ప్రమోద్ గౌడ్ పాల్గొన్నారు.



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో మహిపాల్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంగారెడ్డి: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 1996–97 ఏడాది పదో తరగతి బ్యాచ్ ఒకే వేదికపైకి వచ్చి అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను పూలబొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మత్యుంజయం, కె. రాములు, గుండప్ప, రత్నప్రభ, శ్రీనివాసరావు, నాగార్జునరెడ్డి, స్వర్ణలత, రిజ్వానా సుల్తానా, బన్సీలాల్ బాబు, మల్లేశం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ సంస్థ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం టి.స్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సూచనలు, సలహాల కోసం ఉ.10 గంటల నుంచి 11 గంటల వరకు 9959226269 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలుపాలని కోరారు.

తాగునీటి వృథాను అరికట్టలేరా!

- సంవత్సరాలుగా వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని అధికారులు



వెంకటాపూర్‌లో వృథాగా పోతున్న బోరునీరు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందక ప్రజలు అల్లాడుతుంటే... ఇక్కడ మాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా బోరు నీళ్లు కొన్ని సంవత్సరాలుగా వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం.. సదాశివపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో 24 గంటలు బోరు నుంచి తాగునీరు వృథాగా పోతుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బోరు పైపు నల్లాకు మరమ్మతులు చేపట్టకపోవడంతో లీకేజీలు ఏర్పడి రాత్రి, పగలు అనే తేడా లేకుండా తాగునీరు వృథాగా పోతుంది. వేలలో వచ్చే విద్యుత్ బిల్లులతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. చిన్నపాటి మరమత్తులు చేపట్టకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అలాగే, బోరు చుట్టూ పాకూర్ పట్టి అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. దీంతో దుర్వాసనతో పాటుగా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వెంటనే మరమత్తులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని, బోరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం

మునిపల్లి(అందోల్): అధైర్య పడకండి అండగా ఉంటామని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ధైర్యం చెప్పారు. సోమవారం మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నవాజీరెడ్డి వర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శైలజా శివశంకర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాయికుమార్, రాయికోడ్ మండల పార్టీ నాయకులు, మునిపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వర్ధంతి కార్యక్రమంలో చంటి క్రాంతికిరణ్

నగదు రహిత లావాదేవీలపై అవగాహన



ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్

మహిళలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

వట్‌పల్లి(అందోల్): స్వయం సహాయక సంఘం మహిళలు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధి దేవునూర్ రైతువేదిక భవనంలో టీజీఎస్ఈఆర్పీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సంఘాల మహిళా సభ్యులకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగదు రహిత లావాదేవీలతో మోసాలకు చెక్ పెట్టవచ్చన్నారు. అన్ని రంగాల్లో మహిళలను భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అక్షరాస్యతను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు కవిత, ఉల్తానా, సీసీలు నిరంజన్, మల్లీశ్వరీ, జనార్దన్, మాణెమ్మ, వీఓఏ గోపాల్, స్వరూప, రుక్మిణీ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించడంలో నిర్లక్ష్యం

సంగారెడ్డి జోన్: విద్యుత్తు లైను ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న తమకు సరైన పరిహారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఇతర ప్రాంతాల్లో ఇచ్చిన నష్టపరిహారం మాదిరిగా తమకు కూడా చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయడంతో తమ భూముల విలువ కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని మనూర్, రాయికోడ్, ఝరాసంగం, మునిపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో పనులు చేస్తున్నారని తెలిపారు. భారీస్థాయిలో విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడంతో పొలం పనులు చేసేందుకు కూలీలు నిరాకరిస్తున్నారని చెప్పారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

మరమ్మతులు చేపట్టాలని వినతి

జహీరాబాద్ టౌన్: గుంతలమయంగా తయారైన హుగ్గెల్లి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గ్రామస్తులతో కలిసి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ హుగ్గెల్లి నుంచి పిచరాగడి వైపు రోడ్డుపై నుంచి సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలు పడడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కాలినడకన వెళ్లడం కూడా కష్టంగా ఉన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు.



చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేశ్ తదితరులు

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా 13 మందికి రూ.వెయ్యి, మరో ముగ్గురికి రూ.2 వేలు, ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

16 మందికి జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడి ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం పకారం.. ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్ధిఖీ ముగ్గురికి రూ. 2000, మిగతా ఐదుగురికి రూ. 1500, మిగతా ఎనిమిది మందికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

◆ పశువుల పాకలు మంజూరు

కంది(సంగారెడ్డి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కంది మండలానికి 35 పశువుల పాకలు, 7మేకలు, గొర్రెల షెడ్లు, రెండు కోళ్ల పెంపకం షెడ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కోపశువుల పాకకు రూ.95 వేలు, మేకలు, గొర్రెలు షెడ్డు నిర్మాణానికి లక్ష రూపాయలు చొప్పున మంజూరయ్యాయి. కోళ్ల షెడ్డుకు రూ.50వేల మంజూరయ్యాయి. షెడ్ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి గల రైతులను ఎంపిక చేస్తున్నారు. పనులు ప్రారంభించిన తర్వాత వెజ్ కాంపోనెంట్ కింద ప్రతివారం కొంతమేర డబ్బులు లబ్ధిదారులకు చెల్లిస్తారు. నిర్మాణం పూర్తి అయ్యాక మొత్తం డబ్బులను లబ్ధిదారులకు చెల్లించనున్నట్లు ఉపాధిహామీ ఏపీఓ గురుపాదం తెలిపారు.

◆ విద్యార్థికి ఉస్మానియాలో ఫ్రీ సీటు

కంగ్టి(నారాయణఖేడ్): మారుమూల ప్రాంత విద్యార్థికి ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సులో ఉచితంగా అడ్మిషన్ లభించడంతో స్థానికులు అభినందలు తెలిపారు. కంగ్టి మండలం తడ్కల్ గ్రామానికి చెందిన కాపర్తి మణికంఠ నీట్ పరీక్షలో 538 మార్కులతో రాష్ట్రంలో 352 ర్యాంకు సాధించాడు. ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు రావడంతో తల్లిదండ్రులు విద్యార్థి మణికంఠను స్థానికులు అభినందించారు.

◆ 31 వాహనాలకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న 31 వాహనాలకు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లాల్‌నాయక్ తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలో మూడు చోట్ల లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ వెహికల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న 31 వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి

రాయికోడ్(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం నిర్వహించాలని వివిధ గ్రామాల దళితులు సోమవారం తహసీల్దార్ ఆశాజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రతి నెల చివరి రోజు మండలంలోని ఒక గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో పోలీసు, ఇతర ప్రభుత్వశాఖల అధికారులు దళితవాడను సందర్శించి సమావేశాలు నిర్వహించేవారన్నారు. గత కొన్ని నెలలుగా పౌరహక్కుల పరిరక్షణ సమావేశాలు నిలిచిపోయాయన్నారు. కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎం.ప్రవీణ్‌కుమార్, శాంసన్, యాదుల్, రాజు, ఆనంద్ తదితరులు ఉన్నారు.